క్లుప్తంగా

యోగాతో మానసిక ప్రశాంతత



బిక్కవోలులో యోగా చేస్తున్న అధికారులు

బిక్కవోలు: మండలంలో యోగా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. బిక్కవోలు టీటీడీ కల్యాణం వేదిక వద్ద ఎంపీపీ తేతలి సుమ అధ్యక్షతన పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందితో పాటు ఇతర శాఖ అధికారులు యోగా చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.సుజాత తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో జరిగిన ఈ పరీక్షకు 300 మంది హాజరు కావాల్సి ఉండగా, 281 మంది వచ్చారన్నారు.

27 నుంచి మానసిక శిక్షణ తరగతులు

రంగంపేట: రంగంపేటలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ రాష్ట్రీయ స్వయం సేవక సంఘం పెద్దాపురం ఖండ్ ఆధ్వర్యంలో శారీరక, మానసిక పరిస్థితులపై ప్రారంభిక శిక్ష వర్గ 2025 నిర్వహించనున్నట్టు సమరసతా సేవా ఫౌండేషన్ కాకినాడ జిల్లా సాంస్కృతిక ప్రముఖ్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. పెద్దాపురం ఖండ కార్యావహ ఎస్వీ ప్రసాద్ పర్యవేక్షణలో 15 నుంచి 60 ఏళ్ల పురుషులకు వ్యాయామం, యోగాసనాలు, ఆటలు, కథలు, దేశభక్తి, దైవభక్తి, జాతీయ భావాలు, వ్యక్తిత్వ నిర్మాణం తదితర వాటిపై ఆర్‌ఎస్‌ఎస్ శారీరక, మానసిక శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఈ శిక్షణ తరగతులకు వచ్చే వారు శారీరక వ్యాయామం, ఆటల కోసం వీలుగా ఉండే దుస్తులతో పాటు కంచం, గ్లాసు, నోటు పుస్తకం, కలం తెచ్చుకోవాలన్నారు. విలువైన వస్తువులు తీసుకురాదన్నారు. ఇతర వివరాలకు 80992 21797, 98851 67399 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి



రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

రాజానగరం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సూర్యారావుపేటలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, ప్రచార కమిటీ చైర్మన్ వడయార్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మోర్త శారద పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన తరగతులు

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో 20వ రోజు వేసవి విజ్ఞాన తరగతులను లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. చదవడం మాకిష్టంలో భాగంగా 'రెక్కల గుర్రం' అనే కథను చదివించారు. లైబ్రేరియన్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చదరంగం, క్రాఫ్ట్స్ వర్క్ పోటీలు నిర్వహించారు. విజేతలకు పెన్నులు, స్కేల్స్ అందించారు. రిటైర్డ్ సహాయ సంక్షేమ అధికారి ఓఎస్ సురేష్‌బాబు, సీనియర్ పాఠకుడు కోలపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ గురించి వివరించారు.

ఇరువర్గాలపై కేసులు

బిక్కవోలు: రంగాపురం గ్రామంలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రంగాపురానికి చెందిన పోత్రు రాంబాబు తన ఇంటి వద్ద సిమెంట్ బల్లలపై కూర్చుని ఉన్నాడు. అతని పెద్ద కుమారుడు వెంకటేష్‌ను పశువులకు గడ్డి వేయమని చెప్పాడు. అక్కడ తంగెళ్ల శ్రీను, తరుణ్, నక్క ఆంజనేయులు, నక్క రాజు, నక్క దుర్గయ్య, తంగెళ్ల దుర్గయ్య, తంగెళ్ల శివకృష్ణలు మందు తాగుతూ ఉన్నారు. వారిని పక్కకు జరగమని చెప్పి ఇంటికి వచ్చిన వెంకటేష్‌తో పాటు అతని తండ్రి పోట్లు రాంబాబులను వీరంతా కలసి కర్రలతో దాడి చేశారని ఫిర్యాదు అందినట్లు ఎస్సై తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామన్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన నక్క మోసిబాబు, అతని బావమరిది తంగెళ్ల తరుణ్‌లను పోత్రు రాంబాబు, అతని కుమారుడు వెంకటేష్ కర్రలతో కొటినట్లు మరో ఫిర్యాదు అందిందని ఎస్సై తెలిపారు. ఈ గొడవల నేపథ్యంలో తొమ్మిది మందిపై బైండోవర్ కేసు పెట్టి తహసీల్దార్ బి.కృష్ణ సమక్షంలో హాజరుపరిచామన్నారు.

ప్రమాదాల వైన్‌ం

- ప్రధాన కూడళ్లలో మద్యం దుకాణాలు
- ప్రమాదాల బారిన ప్రజలు



గాడాల హైవేలో మద్యం షాపునకు వెళ్లే ఈ మార్గంలో ప్రమాదాలు జరుగుతున్నాయి

కోరుకొండ: కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోంది.. వీధికో దుకాణంలా ఏర్పాటు చేయడంతో దీనికి బానిసలవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.. మద్యం దుకాణాల ఏర్పాటుతో ప్రభుత్వం ఖజానా నింపుకొంటోంది. ఇదిలా ఉంటే ప్రధాన కూడళ్లలో మద్యం దుకాణాలు ఉండడం, అక్కడే కొందరు తప్పతాగి ఊగుతూ తూగుతూ వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కోరుకొండ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో 13 మద్యం దుకాణాలు ఉన్నాయి. కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో ఈ దుకాణాలు ఏర్పాటు చేశాయి. ఈ దుకాణాలన్న కూడళ్లలో ప్రజల రాకపోకలు అధికంగా ఉంటోంది. దీనివల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఎక్కడెక్కడ.. ఎలా అంటే..

చాలా గ్రామాల్లో ప్రధాన రహదారిని ఆనుకొని మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం కొండ దిగువ భాగంలో మద్యం దుకాణం వద్ద అనేక మంది మోటార్ సైకిలిస్టులు ప్రమాదాలకు గురయ్యారు. గాడాలలో రహదారికి కుడివైపున ఉన్న వైన్ షాపు వద్దకు వెళ్లే వినియోగదారులను వెనుక వైపు నుంచి వచ్చే వాహనచోదకులు ఢీకొడుతున్న ఘటనలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ గాడాల వైన్ షాపుకళ్లే పాయింట్‌లో 8 ప్రమాదాలు జరిగాయి. అలాగే జంభూపట్నంలో మద్యం షాపు వద్దకు వచ్చేవారూ ప్రమాదాలకు గురయ్యారు. గోకవరంలో 3 షాపుల వద్ద 12 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కొత్తపల్లి, గుమ్మళ్లదొడ్డి వద్ద ఆరు ప్రమాదాలు జరిగాయి. ఇలా పలువురు గాయాలపాలయ్యారు.

మద్యం దుకాణాలివే..

కోరుకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కోరుకొండ, **గోకవరం, సీతానగరం మండలాల్లో 13 దుకాణాల ద్వారా విక్రయాలు జరుగుతున్నాయి. కోరుకొండ మండలం కోరుకొండలో 3, గాడాలలో 1, బూరుగుపూడిలో 1, గోకవరం మండలం గోకవరంలో 3, గుమ్మళ్లదొడ్డి 1, కొత్తపల్లి 1, సీతానగరం మండలం** సీతానగరంలో 2, రఘుదేవపురంలో ఒక మద్యం దుకాణాలున్నాయి. వీటిద్వారా జోరుగా అమ్మకాలు జరుగుతున్నాయి. మద్యం దుకాణాలున్నా ప్రాంతాల్లో పార్కింగ్ వ్యవస్థ లేకపోవడం, ఎక్కడికక్కడే వాహనాలు నిలపడం ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. మెయిన్ రోడ్లకు దగ్గర్లోనే ఈ దుకాణాలు ఉండడంతో మందుబాబులు హడావుడిగా వెళ్లడం, పలుచోట్ల అక్కడే తాగి ఊగుతూ రావడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

బెల్టు దుకాణాల్లో అమ్మకాల జోరు

కోరుకొండ సర్కిల్ పరిధిలో బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతోంది. మద్యం దుకాణాల నుంచి కొనుగోలు చేసిన మద్యాన్ని వీరు అధిక ధరలకు వినియోగదారులకు అమ్ముతున్నారు. సర్కిల్ పరిధిలో 200 బెల్టుషాపుల ద్వారా విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రతి బాటిల్‌పై అదనంగా రూ.40 వసూలు చేస్తున్నారు. వీటిని రాజకీయ నాయకులే నిర్వహించడం గమనార్హం.

నిబంధనలు బేఖాతర్

దేవాలయాలు, పాఠశాలలు విద్యాసంస్థల సమీపంలో మద్యం దుకాణాలు ఉండకూడదు. ప్రధాన రహదారులు, కూడళ్లకు దూరంగా ఉండాలి. మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్ ఉండరాదు. అలాగే నిర్ణీత సమయాన్ని పాటించాలి. దుకాణం వద్దకు వెళ్లే మార్గం వినియోగదారులకు అనువుగా ఉండాలి. ఘర్షణలు, దాడులు జరగడానికి అవకాశం లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. దీనికి భిన్నంగా దుకాణాలను ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. కోరుకొండలో పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి ఆనుకుని మద్యం దుకాణం ఉండడంపై సర్వత్రా నిరసన వెల్లువెత్తుతోంది.



గాడాల వైన్ షాపు వద్ద నిల్చుని మద్యం తాగుతున్న మందుబాబులు

నాణ్యమైన మద్యం అంటూ..



కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యం విక్రయిస్తున్నామంటూ మరీ వ్యాపారం చేస్తుంది. సిండికేట్లుగా ఏర్పడిన కూటమి నాయకులు మద్యం దుకాణాలను దక్కించుకున్నారు. లాభాలే లక్ష్యంగా వ్యాపారం చేస్తూ, ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నారు. మద్యం ధరలు పెంచడం దారుణం.

– మద్దాల చంటిబాబు, మా వేదిక కన్వీనర్

మారుమూల గ్రామాల్లోనూ..



మారుమూల గ్రామాల్లో సైతం మద్యం ఏరులై పారుతోంది. ప్రధాన రోడ్లలో మద్యం షాపులు ఏర్పాటు చేయడంతో స్థానికులు, ప్రయాణికులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. షాపుల వద్ద సిట్టింగ్‌కు అనుమతులు ఇవ్వకూడదు. గత ప్రభుత్వంలో మద్యం షాపుల వద్ద తాగడం నిషేధంగా ఉండేది. కానీ కూటమి ప్రభుత్వంలో పట్టించుకోవడం లేదు.

– కేతినీడి అశోక్, కోరుకొండ

ఇంటింటికీ రేషన్ కొనసాగించాలి



సీతానగరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న మండల ఎండీయూ ఆపరేటర్లు

సీతానగరం: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ రేషన్ సరకులు అందించే విధానాన్ని కొనసాగించాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌కు మండలంలోని మొబైల్ డిస్ట్రిబ్యూషన్ ఆపరేటర్లు (ఎండీయూ) వినతిపత్రం అందించారు. ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలని కోరుతూ సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు మండల ఎండీయూ యూనియన్ అధ్యక్షుడు ఈతకోట పోశియ్య, ఉపాధ్యక్షుడు భజన శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆమోదంలో 2021 నుంచి పౌరసరఫరాల శాఖలో రేషన్ సరకులను ప్రజల వద్దకు పంపిణీ చేస్తున్నామన్నారు. కరోనా సమయంలో కూడా సేవలు అందించామని గుర్తు చేశారు. తమకు 2027 వరకు గడువు ఉందని, కూటమి ప్రభుత్వం ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా రద్దు చేయడం అన్యాయమన్నారు. తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఎండీయూ ఆపరేటర్ల రాష్ట్ర సమైక్య యూనియన్ ఆదేశాల మేరకు తమ సమస్యలు పరిష్కరించే వరకూ శాంతియుతంగా నిరసన తెలియజేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల యూనియన్ కోశాధికారి చిడిపి శివాజీ, గణపగురువులు, రాయుడు, మణి, బడుగు వాసుదేవరావు, నాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ఉపాధి పనుల పరిశీలన



నల్గొండలో ఉపాధి కూలీల మస్తర్లను పరిశీలిస్తున్న ఏపీఓ సత్యవతి

సీతానగరం: మండలంలోని నల్గొండలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు 170 మంది కూలీలు వస్తున్నారని ఏపీఓ బీవీ సత్యవతి తెలిపారు. బుధవారం నల్గొండలో నిర్వహిస్తున్న కాలువ పూడికతీత పనులు, కూలీల మస్తర్లను ఆమె పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నల్గొండలో నాలుగు కాలువల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయన్నారు. మండలంలోని 21 పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చెరువులు, కాలువల్లో పూడికతీత, గట్ల పటిష్టం, రైతుల పంట పొలాల్లో నీటిగుంటల ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు. మండల గ్రామాల్లో జరిగే పనులకు 3,284 మంది కూలీలు వస్తున్నారని తెలిపారు. కూలీలకు రోజువారీ కూలి వచ్చే విధంగా పనులు చేస్తున్నారని, వేసవి కావడంతో ఉదయం 10.30 గంటల వరకూ పనులు చేస్తున్నారని ఏపీఓ వివరించారు.

ఫ్లైఓవర్‌పై ఒక్క లైటూ వేయలేరా!

- కూటమి ప్రభుత్వంలో ప్రయాణికులకు అవస్థలు
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్



మోరంపూడి ఫ్లైఓవర్‌పై లైట్లు లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులను ఎన్‌హెచ్ అధికారికి వివరిస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

రాజానగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా, ఇంతవరకూ మోరంపూడి ఫ్లైఓవర్‌పై ఒక్క లైటు కూడా వేయలేకపోయిందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. ప్రభుత్వ అసమర్థతకు ఇంతకంటే మరో ఉదాహరణ ఏం కావాలన్నారు. ఫ్లైఓవర్‌పై విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి, సర్వీసు రోడ్లను బాగు చేయాలని కోరుతూ దివాన్‌చెరువులోని నేషనల్ హైవే కార్యాలయంలో డీజీఎం సురేంద్రనాథ్‌కు బుధవారం ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఫ్లైఓవర్‌పై విద్యుత్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే సర్వీసు రోడ్లను పట్టించుకోకపోవడం వల్ల మోకాల్లోతు గుంతలతో ఉన్న ఆ రోడ్లపై ప్రయాణించడానికి ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఆ గోతుల్లో ఇటీవలే ఒక లారీ పడి, చక్రాలు విరిగిపోయాయంటే పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ ఫ్లైఓవర్‌ను ప్రారంభించడానికి ఆరాటపడిన కూటమి పాలకులు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించడంలో ఎందుకు శ్రద్ధ చూపలేకపోతున్నారని ప్రశ్నించారు. ఫ్లైఓవర్ పనులను పూర్తి చేయిస్తానని ఇచ్చిన మాటను నెరవేర్చానని గుర్తు చేస్తూ, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తే ఆ క్రెడిట్ తనకెక్కడ వస్తుందోనని కూటమి పాలకులు భయపడుతున్నట్టున్నారంటూ ఎద్దేవా చేశారు. ఈ ఫ్లైఓవర్ సమయంలోనే లాలాచెరువు, బొమ్మూరు, ఐటీసీ జంక్షన్, వేమగిరి జంక్షన్లలో ఫ్లైఓవర్ల నిర్మాణాలకు రూ. 395 కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు. ప్రస్తుతం వీటిలో బొమ్మూరు జంక్షన్ వద్ద చేసిన ప్రతిపాదనను పక్కన పెట్టినట్టుగా తెలుస్తుందన్నారు. ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు భవిష్యత్తులో ఎదురయ్యే ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఏవీ అప్పారావు రోడ్డు, జేఎన్ రోడ్డు జంక్షన్లకు కూడా ఫ్లైఓవర్ సదుపాయం కల్పించాలన్నారు. అలాగే ఐటీసీ సెంటర్ లాలాచెరువు జంక్షన్ల మధ్య సింగిల్ ఫ్లైఓవర్‌ను ఏర్పాటు చేయించాలన్నారు. రాబోయే పుష్కరాలకు ముందుగానే ఈ పనులన్నీ పూర్తి కావాలని, లేకుంటే వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యాలకు గురికావాల్సి వస్తుందని భరత్‌రామ్ హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి గంగాధరరావు, గుత్తుల మురళీధర్, మార్తి లక్ష్మి, దాసి వెంకట్రావు, మజ్జి అప్పారావు, కడియాల శ్రీను, పీతరామకృష్ణ, సప్పా ఆదినారాయణ, గణేష్, చీర రాజు, బొప్పన సుబ్బారావు, మునీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని ఆదరించాలి

అనపర్తి : నాటక రంగాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ 36వ జాతీయ స్థాయి సాంఘిక నాటక పోటీలు బుధవారం అనపర్తి మండలం రామవరంలోని నల్లమిల్లి సుబ్బిరెడ్డి స్మారక కళా మందిరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాపరిషత్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధ్యతన జరిగిన ఈ కార్యక్రమాన్ని మంత్రి దుర్గేష్ హాజరై ప్రారంభించారు. కళామతల్లిని ప్రోత్సహించడానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. మరో ముఖ్య అతిథి రాష్ట్ర అబ్కారీశాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నాటకానికి, సినిమాల ప్రోత్సాహానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం మహా గ్రూప్ చైర్మన్ మారేళ్లపూడి వంశీని సన్మానించారు. అనంతరం జనరల్ బోగీలు, కిడ్నాప్ నాటికలు ప్రదర్శించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సినీ నటుడు గౌతంరాజు, అభినయ శ్రీనివాస్, బుద్ధాల వెంకట రామారావు, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు



వైఎస్సార్ సీపీ మండల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు, గూడూరి శ్రీనివాస్

కడియం: అధికారంలోకి వచ్చేందుకు బూటకపు హామీలు ఇచ్చి ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కడియం మండల పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలసి వేణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క పింఛన్లు తప్పితే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని ఏడాది అవుతున్నా కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. హామీలు అమలు చేయకపోతే తాను బాధ్యత తీసుకుంటానంటూ ప్రతి సమావేశంలోనూ ఊదరగొట్టిన పవన్ కళ్యాణ్‌కూడా ఇప్పుడు మాట్లాడకపోవడం దారుణమన్నారు. ధాన్యం రైతులకు మద్దతు ధర లభించే విధంగా గత సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని వేణు గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కారణంగా ప్రతి బస్తాకు రైతులు రూ. 200 నుంచి రూ.300 నష్టపోవాల్సి వచ్చిందన్నారు. అలాగే పొగాకు రైతులు గత ప్రభుత్వ హయాంలో కిలో రూ. 410 వరకు అమ్ముకోగలిగారన్నారు. ఇప్పుడు రూ. 210 ధర దక్కడం గగనంలా మారిందన్నారు. కరోనా సమయంలోనూ గత ప్రభుత్వం రూ.30 వేల కోట్లను ప్రజా సంక్షేమం కోసం ఖర్చు చేసిందన్నారు. అప్పటి అనుభవాల దృష్ట్యా 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే, కూటమి ప్రభుత్వం వాటిని నీరుగార్చేసిందన్నారు. పేదలకు ఇంగ్లిషు మీడియం చదువును కూడా చంద్రబాబు ప్రభుత్వం దూరం చేసిందన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా పథకాల అమలు జరిగిందన్నారు. ఇప్పుడు అసలు పథకాలు ప్రజలకు అందడం లేదన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తల బలంతో వైఎస్సార్ సీపీ రానున్న ఎన్నికల్లో అధికారం చేపట్టడం ఖాయమన్నారు.

ఉత్సాహంగా తరలివచ్చిన శ్రేణులు

మండల వైఎస్సార్ సీపీ సమావేశానికి వివిధ గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముందుగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. అలాగే ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన పార్టీ కార్యకర్తల మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఉగ్రదాడిలో చనిపోయిన సాధారణ ప్రజలు, సైనికుల మృతికి సమావేశం మౌనం పాటించింది. అనంతరం పార్టీ భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్ చంద్రస్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, బడుగు ప్రశాంత్‌కుమార్, దుళ్ల ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి తదితరులు కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏకరవు పెట్టారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రానున్నది మన ప్రభుత్వమేనని, గతంలో జరిగిన పొరపాట్లు సరిచేసుకుని పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం పాటు పడతామన్నారు. వలంటీర్లను తొలగించారని, ఇంటింటికీ రేషన్ సరఫరా చేసే ఎండీయూ ఆపరేటర్లను తొలగించడం ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి లేకుండా చేస్తున్నారన్నారు. ప్రజల్లో ఇప్పటికే ప్రభుత్వంపై తిరుగుబాటు ధోరణి మొదలైందన్నారు.

సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



జి.మామిడాడ మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు సకాలంలో పూర్తి చేయాలని కాకినాడ హౌసింగ్ డీఈ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం జి.మామిడాడ గ్రామంలో 56 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు లబ్ధిదారులు వినియోగించుకుని గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు గృహ నిర్మాణ రుణం వెంటనే వారి ఖాతాల్లో జమ అవుతుందన్నారు. అనంతరం వారి సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జి ఏఈ సోమిరెడ్డి, సచివాలయ కార్యదర్శి కనక నాగేంద్ర, వెలుగు సీసీ శ్రీనివాస్, నాయకులు మురమళ్ల వెంకటరమణ, మేడపాటి వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వానా.. నానా హైరానా

- నగరంలో ఎక్కడికక్కడే ముంపు
- చిన్నపాటి వర్షానికే ఇబ్బందులు
- జన జీవనానికి తప్పని పాట్లు



వర్షం నీటితో నిండిన పేపర్‌మిల్లు నుంచి దేవీచౌక్‌కు వెళ్లే కృష్ణానగర్ ఏరియా (ఫైల్)



కంబాల చెరువు వద్ద వర్షంతో గొడుగు వేసుకుని ఇలా వెళ్తూ..

సీటీఆర్ఐ: నగరం... నీటితో సహవాసం అన్నట్లు ఉంది. చిన్నపాటి వర్షానికే ముంపునీరు ఎక్కడికక్కడే తిష్ట వేస్తోంది. అక్కడ ఇక్కడ అని చెప్పుకోవడానికి ఏముందీ అన్ని ప్రాంతాల్లో దాదాపు ఇదే పరిస్థితి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం ఒక సమస్య అయితే, ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయి నీరు ముందుకు కదలక రోడ్ల మీదకు వస్తోంది. దీంతో జనజీవనానికి ఆటంకం కలుగుతోంది.. బుధవారం రాజమహేంద్రవరం అర్బన్‌లో 2.4 శాతం, రూరల్‌లో 8.5 శాతం వర్షపాతం నమోదు అయ్యింది. చిన్నపాటి వర్షానికే కాలువల్లో చెత్త రోడ్డుపైకి వస్తోంది. దీనికితోడు వర్షపునీరు ఇళ్ల ముందు నిలిచిపోతుంది. మంగళ, బుధవారం కురిసిన వర్షానికి వీధుల్లో నీటితోపాటు చెత్త కారణంగా దుర్గంధభరిత వాతావరణం నెలకొంది.

ముంపు... కంపు

రాజమహేంద్రవరం నగరంలో ప్రధానంగా ఆర్యాపురం, లలితానగర్, వీరభద్రపురం, బోధిస్కూల్, కృష్ణానగర్, ఆదెమ్మ దిబ్బ, లింగంపేట, వాంబే గృహాలు, ఎన్ఆర్‌సీ లైన్ ప్రాంతాల్లో ముంపు సమస్య అధికంగా ఉంది. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. దీనివల్ల నీరు రహదారిపై తిష్ట వేస్తోంది. వాహనదారులు, నడిచి వెళ్లాలన్నా ఇబ్బందే. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలతో ఇక్కడ రోడ్లపై వర్షం నీరు స్థానికులను ఇబ్బందుల పాల్జేస్తోంది. ఈ నీటిని తోడించి సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

చిరు వ్యాపారం.. దూరం

నగరంలో చాలా ప్రాంతాల్లో తోపుడు బండ్లు, రోడ్ల పక్కన వ్యాపారం చేసేవారికి ఈ వాన ఇబ్బందులు తెచ్చిపెట్టింది. కూలి పనులు లేక, చిరు వ్యాపారులు సాగక చాలామంది అవస్థలు ఎదుర్కొన్నారు. వర్షం ఎక్కువగా కురవడంతో వాతావరణం కొంత ఆహ్లాదకరంగా మారినప్పటికీ చిరు వ్యాపారాలకు బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. విక్రయించడానికి తెచ్చిన పండ్లు, కూరగాయలు, పూలు తడిసిపోవడంతో వీటిని కొనేవారు లేక ఆవేదన చెందారు. బుధవారం సాయంత్రం కాస్త తెరుపు ఇవ్వడంతో తిరిగి అక్కడక్కడ వ్యాపారాలను ప్రారంభించారు.

కాస్త చల్లబడి..

కొద్ది రోజులుగా భానుడు తన విశ్వరూపం చూపుతున్నాడు. ఎండలతో మండిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటడంతో ప్రజలంతా చాలా ఇబ్బందులు గురయ్యారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం కాస్త బడింది. రుతుపవనాల రాకతో వర్షం పడుతుండటం ఆనందంగా ఉన్నప్పటికీ రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు నానా హైరానా పడ్డారు. దీనికితోడు చాలాచోట్ల గుంతల్లో నీరు చేరడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.